# సాక్షి విజయనగరం

1

ఆదివారం । 12 । నవంబర్ । 2023




## న్యూస్‌రీల్

### వైద్య విద్యార్థుల ఇంటింటి సర్వే



గొట్లాంలో ఇంటింటి వైద్యసర్వే చేస్తున్న విజయనగరం మెడికల్ కళాశాల విద్యార్థులు

బొండపల్లి: మండలంలోని గొట్లాం పంచాయతీ పరిధిలోని గొట్లాం, జియ్యన్నవలస, బారిక పాలెం, రెడ్డిపేట గ్రామాల్లో విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు శనివారం ఇంటింటి సర్వే చేశారు. ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. వైద్య విద్యార్థులు 150 మంది గ్రామంలోని 750 కుటుంబాలను దత్తత తీసుకున్నారు. ప్రతినెలా వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని ఉచిత వైద్యసేవలందిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతి వైద్య విద్యార్థి ఐదు కుటుంబాల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుని కావాల్సిన వైద్యసేవలు అందిస్తున్నారు. సర్వేకు వైస్ ఎంపీపీ మీసాల సరోజిని, పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ మహంతి రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు మీసాల తులసీరాం, గ్రామ సర్పంచ్ సహకరించారు.

### ప్రమాదరహిత డ్రైవింగ్ నైపుణ్యాలు అవసరం

- ఆర్టీసీ డీపీటీఓ విజయకుమార్



మాట్లాడుతున్న శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణా అధికారి విజయకుమార్

విజయనగరం అర్బన్: ఆర్టీసీ రవాణా సేవల్లో డ్రైవింగ్ నైపుణ్యాలు ప్రమాద రహితంగా ఉండాని శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణా అధికారి విజయకుమార్ అన్నారు. ఆర్టీసీ శిక్షణ కళాశాలలో 15 రోజులుగా డ్రైవర్లకు నిర్వహించిన శిక్షణతరగతుల ముగింపు కార్యక్రమానికి శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు ఎప్పటికప్పుడు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. డిప్యూటీ సీఎంఈ కొటాన శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్రీకాకుళం, ఉమ్మడి విజయనగరం జిల్లాలోని 600 మంది డ్రైవర్లకు రోజుకు 40 మంది చొప్పున ప్రమాద రహిత డ్రైవింగ్ నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో టెక్కలి డిపో మేనేజర్ శ్రీనివాసరావు, రీజనల్ సేఫ్టీ మెకానికల్ ఇన్‌స్ట్రక్టర్ సీహెచ్.వేణు తదితరులు పాల్గొన్నారు.

### చదువుతోనే భవిష్యత్తు




విద్యార్థికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న జేఎన్‌టీయూ జీవీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీకుమార్

విజయనగరం అర్బన్: చదువుతోనే బంగారు భవిష్యత్తు సొంతమవుతుందని, ప్రతి విద్యార్థి చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని జేఎన్‌టీయూ జీవీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీకుమార్ పిలుపునిచ్చారు. విజయనగరం పట్టణంలోని గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. విద్య ప్రాధాన్యతను వివరించారు. ప్రాథమిక హక్కుగా ఉన్న విద్యను అభ్యసించి భావితరాలకు ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డి.వి.రామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ వెంకట లక్ష్మి, గ్రంథాలయాధికారి లెంక సత్యవతి పాల్గొన్నారు.

## వెలుగుల పండగ దీపావళి



- చిన్నపాటి జాగ్రత్తలతో సంతోషాల హరివిల్లు
- టపాసులు కాల్చేటప్పుడు తస్మాత్
- దీపావళి.. కారాదు విషాదవళి
- కొనుగోలుదారులతో కిక్కిరిసిన బాణసంచా విక్రయ దుకాణాలు
- రూ.కోట్లలో సాగిన వ్యాపారం

**అగ్నిప్రమాదాలు సంభవిస్తే 101, 102 నంబర్లకు, గాయపడితే 108 కు సమాచారం ఇవ్వాలి**



విజయనగరం ఆర్టీఓ కార్యాలయం సమీపంలో బాణసంచా విక్రయ కేంద్రాలు

విజయనగరంటౌన్/పార్వతీపురంటౌన్: అజ్ఞాన చీకట్లను పారదోలే చిరుదివ్వెల పండగ దీపావళి. లోగిళ్లన్నీ నవకాంతులతో వెలుగులీనే వేడుక. పండగ రోజున ఉదయాన్నే చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా నూతన వస్త్రాలను ధరించి లక్ష్మీదేవికి పూజలు, నోములు నిర్వహించడం మన సంప్రదాయం. దానిని కొనసాగిస్తూనే రాత్రివేళ ఇల్లంతా దీపాలతో అలంకరించి, శబ్దరహిత, వాయుకాలుష్యంలేని బాణసంచా కాల్చి... దీపావళిని ఆనందావళిగా జరుపుకోవాలని కాలుష్యనియంత్రణ మండలి, పర్యావరణ పరిరక్షణ సమితులు పిలుపునిచ్చాయి. ఈ ఏడాది గ్రీన్ (హరిత) దీపావళి జరుపుకోవాలని కోరాయి.

**షాపింగ్ అదరహో...**

దీపావళి సందర్భంగా వ్యాపార, వాణిజ్య సంస్థలు భారీ ఆఫర్లను ప్రకటించాయి. దీంతో ఆయా దుకాణాలు, షాపింగ్‌మాల్స్ కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి. బాణసంచా విక్రయాలు జోరుగాసాగాయి. ఉమ్మడి విజయనగరం జిల్లాలో శనివారం నాటికి దాదాపు రూ.6 కోట్లకు పైగా వ్యాపారం సాగినట్టు అంచనా. గృహోపకరణాల విక్రయాలైతే దాదాపు రూ.3.50 కోట్ల మేర సాగినట్టు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

**పూజకు మంచి ముహూర్తం**

దీపావళి అమావాస్య నాడు కేదారేశ్వరి నోములు నోయడం ఆనవాయితీ. సౌభాగ్య సంరక్షణను కాంక్షిస్తూ మహిళలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. ఈ ఏడాది ఆశ్వయుజ అమావాస్య ఆదివారం రోజు పూర్తిగా ఉండడంతో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వ్రతాలు ఆచరించవచ్చని వేదపండితులు వెల్లడిస్తున్నారు.

**బాణ సంచా దుష్ఫలితాలివి**

బాణసంచా తయారీకి అల్యూమినియం, నైట్రేట్, సల్ఫర్, పొటాషియం, బేరియం నైట్రేట్, కార్బన్ కాడ్మియం వంటి రసాయన పదార్థాలను వినియోగిస్తారు. వీటిని కాల్చడం వల్ల మనం పీల్చే ప్రాణవాయువు కలుషితమవుతుంది. కంటికి కనిపించని రసాయన కణాలు శరీరంలోకి వెళ్లి ఆరోగ్యానికి హానికలిగిస్తాయి. ఊపిరితిత్తుల, జీర్ణకోశ వ్యాధులు, కంటి చూపు దెబ్బతినడం, జ్ఞాపకశక్తి మందగించడం, చెవుడు, కేన్సర్, మానసిక స్థితిని దెబ్బతీసే వ్యాధులు వచ్చే ప్రమాదముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. శారీరక దృఢత్వం తక్కువగా ఉండే పిల్లలు, వృద్ధులు, మహిళలపై బాణసంచా ప్రభావం చూపనుంది. గర్భిణులు, కడుపులో ఉన్న శిశువులకు హానికలుగుతుంది. ఆస్తమా, రక్తపోటు, గుండె వ్యాధిగ్రస్తులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది.

**ఈ జాగ్రత్తలు తప్పనిసరి..**

- బాణసంచా కాల్చేటప్పుడు కాటన్ దుస్తులు, కళ్లజోడు ధరించాలి.
- చిన్న పిల్లలు కాల్చేటప్పుడు పెద్దల పర్యవేక్షణ తప్పనిసరి.
- ఇంటిలోపల, డాబాలపైన, అపార్ట్‌మెంట్లపైన టపాసులు వెలిగించరాదు.
- సగం లేదా పూర్తిగా కాలని టపాసులను వదిలేయకుండా నీరు లేదా ఇసుకను పోయాలి.
- శరీరానికి, దుస్తులకు దూరంగా ఉంచి టపాసులు కాల్చాలి.
- గడ్డి వాములు, గుడిసెలు, పెట్రోల్ బంకులకు దూరంగా టపాసులు కాల్చాలి.
- చేతితో పేలుడు పదార్థాలకు నిప్పు అంటించవద్దు.
- శ్వాస, చర్మ, హృదయ సంబంధిత వ్యాధిగ్రస్తులు టపాసులకు దూరంగా ఉండాలి.
- బాణసంచాను ఇళ్లల్లో నిల్వ చేయరాదు.
- రోడ్లపై నడిచే ప్రజలపైన, బస్సులు, వాహనచోదకులపై బాణసంచా విసరడం నేరం.

**జాగ్రత్తలు మరువద్దు..**



దీపావళి పండగను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలి. శబ్ద, కాలుష్య రహిత బాణసంచాకు ప్రాధాన్యమివ్వాలి. బాణసంచా కాల్చేసమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలి.

– ఎం.దీపిక, ఎస్పీ, విజయనగరం

**సుఖసంతోషాలు కలగాలి**



దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి. ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలి. సిరిసంపదలు, సౌభాగ్యాలు కలగాలి. అందరి జీవితాలు ఆనందమయం కావాలి.

– ఆర్.గోవిందరావు, జేసీ, పార్వతీపురం మన్యం

**ఆనందాల పండగ**



కులమతాలకు అతీతంగా, చిన్నాపెద్దా తారతమ్యంలేకుండా ప్రజలందరూ ఆనందంగా జరుపుకునే పండగ దీపావళి. కాలుష్యరహితంగా గ్రీన్ క్రాకర్స్ వినియోగించాలి. బాణసంచా పేల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. దీపావళి వెలుగులు ప్రజలందరి జీవితాల్లో ప్రసరించాలి.

– నాగలక్ష్మి, కలెక్టర్, విజయనగరం

**బాధ్యతాయుతంగా ఉండాలి**



టపాసులు అమ్మే వారందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. అందుబాటులో అగ్నినిరోధక పరికరాల్లో కనీసం ఒకటైనా ఉంచాలి. ఇసుక, నీటిని తప్పనిసరిగా ఏర్పాటుచేసుకోవాలి. ఇళ్లల్లో టపాసులు కాల్చేటప్పుడు మహిళలు, యువతులు, చిన్నారులు కాటన్ దుస్తులు, బిగుతుగా ఉండేవి ధరించాలి. నీటిని అందుబాటులో ఉంచాలి. ఆనందోత్సవాల మధ్య పండగ నిర్వహించుకోవాలి.

– బి.వి.ఎస్. రామ్‌ప్రకాష్, అగ్నిమాపకశాఖ అధికారి, విజయనగరం



విజయనగరంలో జోరుగా బాణసంచా విక్రయాలు



పార్వతీపురంలో ప్రమిదలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

## జ్ఞాన కాంతులు.. కలశ జ్యోతులు

- వేదమంత్రాలతో మార్మోగిన వనంగుడి
- పైడితల్లికి పంచామృతాలతో అభిషేకాలు
- కలశజ్యోతులు పట్టుకుని దీక్షాపరుల ర్యాలీ
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



చదురుగుడిలో ప్రత్యేక అలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: పైడితల్లి నామస్మరణతో విజయనగరం పట్టణం పులకించిపోయింది. మాలధారుల జైజై పైడిమాంబ నామస్మరణ, కలశ జ్యోతుల వెలుగులో అమ్మవారి శోభాయాత్ర శనివారం వైభవంగా సాగింది. వనంగుడి నుంచి చదురుగుడి వరకు దారిపొడవునా భక్తులు జ్యోతి దర్శనం చేసుకున్నారు. చల్లంగ చూడాలంటూ తల్లిని శరణువేడారు. పైడితల్లి అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో సాగిన కలశ జ్యోతుల యాత్రను ఈఓ కె.ఎల్.సుధారాణి స్వీయపర్యవేక్షణ చేశారు. అమ్మవారి ఉత్సవ రథంతో చదురుగుడి వరకూ దీక్షధారులతో కలిసి నడిచారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, వేదపండితులు తాతా రాజేష్, దూసి శివప్రసాద్, సాయికిరణ్‌లు అమ్మవారికి ఉదయం నుంచి శాస్త్రోక్తంగా పూజాధికాలు చేశారు. పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. పైడిమాంబ దీక్షాపీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో, అచ్చిరెడ్డిల నిర్వహణలో దీక్షధారులు భజనలు చేశారు.

**ఊరంతా అమ్మవారి వెలుగులు**

వనంగుడి నుంచి ప్రారంభమైన కలశ జ్యోతుల ర్యాలీ గాడీఖానా, వైఎస్సార్ కూడలి, ఎన్‌సీఎస్ రోడ్డు, కన్యకాపరమేశ్వరి ఆలయం, గంటస్తంభం మీదుగా చదురుగుడికి చేరుకుంది. దారిపొడవునా మహిళలు, భక్తులు అమ్మవారిని దర్శించి, తరించారు. కలశజ్యోతుల ర్యాలీతో నగరానికి దీపశోభ చేకూరింది.



రథాన్ని లాగుతున్న ఆలయ సిబ్బంది, భక్తులు



కలశ జ్యోతుల ఊరేగింపులో స్వాములు, ఇతరులు

## 8 ఏళ్ల కిందట జిల్లాకు వచ్చిన చంద్రమోహన్

విజయనగరం టౌన్: స్థానిక ఆనందగజపతి ఆడిటోరియంలో విశాఖకు చెందిన స్నేహాంజలి ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్కెస్ట్రాకు ఎనిమిదేళ్ల కిందట సినీనటుడు చంద్రమోహన్ ప్రత్యేక ఆహ్వానితులుగా వచ్చారు. విజయనగరం సాహిత్య సౌరభాలకు నిలయమని, కళలకు కాణాచిగా పేరుగాంచిందని, ఘంటసాల, సుశీలమ్మ వంటివారు ఇక్కడ సంగీతం నేర్చుకోవడం ఎంతో అదృష్టమని తెలిపినట్టు ఆయన అభిమానులు గుర్తుచేసుకుంటున్నారు. చంద్రమోహన్ మరణించడంపై విచారం వ్యక్తంచేశారు.



చంద్రమోహన్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న శివప్రసాద్‌రెడ్డి (ఫైల్)

## గ్రంథాలయ వారోత్సవాల షెడ్యూల్ ఇదే

విజయనగరం అర్బన్: జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల షెడ్యూల్‌ను కుసుమ గజపతినగర్‌లోని సంఘ కార్యాలయంలో సంఘం ప్రతినిధులు శనివారం విడుదల చేశారు. తొలిరోజున పట్టణ వీధుల్లో ర్యాలీతో వారోత్సవాలు ప్రారంభంకానున్నాయి. అదేరోజు రాత్రి 7 గంటలకు గురజాడ గ్రంథాలయంలో 'విద్యార్థులందరూ విజేతలే' పుస్తక సమీక్ష ఉంటుంది. 15న ఉదయం 10 గంటలకు గురజాడ గ్రంథాలయంలో పుస్తకదాతలు, గ్రాంథాలయ నిర్వాహకులకు సత్కార కార్యక్రమం ఉంటుంది. 16న ఉదయం ఆర్‌అండ్‌బీ కూడలి వద్ద పుస్తక ప్రదర్శన, సగం ధరకు పుస్తకాల అమ్మకం, 17న లక్ష్మీస్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో గ్రంథాలయ సదస్సు, 18న ఉదయం 10 గంటలకు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, 19న లంకాపట్నంలో అంబేడ్కర్ గ్రంథాలయానికి పుస్తక వితరణ, 20న కాలేజీల్లో గ్రంథాలయ అవగాహన సదస్సులు జరగనున్నవి. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఎస్ఏఎస్ఎస్ రాజు, ప్రధాన కార్యదర్శి కె.దయానంద్, వ్యవస్థాపకుడు అబ్దుల్ రవూఫ్, కోశాధికారి కొత్తలి ఎర్నాయుడు, మాజీ కార్యదర్శి రత్నాల బాలకృష్ణ, ఉపాధ్యక్షుడు ప్రకాశరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



షెడ్యూల్ విడుదల చేసిన సంఘ ప్రతినిధులు

## 16న రాజాంలో సామాజిక సాధికార యాత్ర

రాజాం: రాజాంలో ఈ నెల 16న సామాజిక సాధికార బస్సుయాత్ర సాగనుందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి బస్సు యాత్ర స్థలాన్ని పరిశీలించారు. ఉదయం 10 గంటలకు బొద్దాంలో ప్రెస్‌మీట్, సచివాలయ సందర్శన అనంతరం రాజాం పట్టణానికి బస్సుయాత్ర చేరుకుంటుందన్నారు.

మధ్యాహ్నం 3 గంటలకు అంబేడ్కర్ జంక్షన్ కూడలిలో బహిరంగ సభ ఉంటుందని వివరించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో వెనుకబడిన వర్గాలకు చేసిన మేలును మంత్రులు వివరిస్తారన్నారు. సభాస్థలిని డీఎస్పీ శ్రీనివాసచక్రవర్తి, రాజాం సీఐ రవికుమార్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు, డాక్టర్ తలే రాజేష్, వైఎస్సార్‌సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, పొట్నూరు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



రాజాంలో బస్సుయాత్ర సభాస్థలిని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

## ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు



జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: అజ్ఞానం అనే చీకటిని పారదోలి జ్ఞాన వెలుగులను ప్రసరింపజేసే దీపావళి పండగను ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజలు ఘనంగా జరుపుకోవాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. నరకాసుర సంహారం, రాముడు వనవాసం ముగించుకుని అయోధ్యకు తిరిగివచ్చిన పుణ్య ఘడియలను స్మరించుకుంటూ జరుపుకొనే వేడుకను అన్ని వర్గాల ప్రజలు ఆత్మీయంగా చేసుకోవాలని కోరారు. లక్ష్మీదేవి కటాక్షం ప్రజలందరిపైనా ఉండాలని ఆకాంక్షిస్తూ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## క్లుప్తంగా

### మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థి సత్తా



కోచ్ త్రినాథరావుతో నీలాంజనీప్రసాద్

కొత్తవలస: జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థి ములగపాక నీలాంజనీప్రసాద్ సత్తా చాటారు. మండలంలోని వీరభద్రపురం గ్రామ పంచాయతీ, ములగపాకలవానిపాలెం గ్రామానికి ఈయన ఈ నెల 7, 8, 9వ తేదీల్లో గోవాలో జరిగిన 37వ జాతీయ స్పై మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో 58 కేజీల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి, బ్రాంజ్ మెడల్(రజత పతకం) సాధించినట్లు కోచ్ ఎం.త్రినాథరావు శనివారం తెలిపారు. ఈ పోటీల్లో 16 రాష్ట్రాల నుంచి మొత్తం 216 మంది పాల్గొనగా, ఆంధ్రప్రదేశ్ నుంచి 8 మంది పాల్గొన్నారన్నారు. ఈ మేరకు సదరు విద్యార్థి, కోచ్‌ను పలువురు అభినందించారు.

### ఐఎన్‌ఐ సెట్‌లో మందరాడ వాసికి 155వ ర్యాంకు



వి.చంద్రమౌళి

రాజాం/సంతకవిటి: ఐఎన్‌ఐ(ఇనిస్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్) సెట్ ఫలితాల్లో సంతకవిటి మండలం, మందరాడ గ్రామానికి చెందిన వావిలపల్లి చంద్రమౌళి ఆలిండియా విభాగంలో 155వ ర్యాంకు సాధించారు. ఈ యువకుడు నవంబరు 5వ తేదీన జరిగిన మెడికల్ పీజీ ఎంట్రన్స్ టెస్ట్ రాయగా, శనివారం ఫలితాలు వెలువడ్డాయి. పీజీలో జనరల్ మెడిసిన్ కోర్సు చేసేందుకు గాను ఈ పరీక్ష రాసినట్లు చంద్రమౌళి తెలిపారు. ఈయన 2017లో జరిగిన నీట్‌లో ఆలిండియా విభాగంలో 508వ ర్యాంకు సాధించి, విశాఖ కేజీహెచ్‌లో ఎంబీబీఎస్ పూర్తిచేశారు. తాజాగా ఐఎన్‌ఐ సెట్‌లో కూడా ప్రతిభ చాటడంతో అందరూ అతడిని అభినందిస్తున్నారు. ఈయన తల్లి భాగ్యలక్ష్మి ప్రభుత్వ ఉపాధ్యాయిని కాగా, తండ్రి శ్రీనివాసరావు వైఎస్సార్ క్రాంతి పథం శాఖలో సీసీగా పనిచేస్తున్నారు.

### ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు

- శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం రూరల్: జిల్లా ప్రజలకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం దీపావళి పండగ పురస్కరించుకుని, విలేకరులతో శనివారం మాట్లాడిన ఆయన ఈ వెలుగుల పండగ ప్రతిఒక్కరి జీవితంలో సుఖసంతోషాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి గెలిచిందన్న దానికి ప్రతీకగా చేసుకునే ఈ వేడుకలు అందరి ఇళ్లల్లో ఆనందం వెల్లివిరిసేలా చేయాలని కోరారు.

# నాణ్యమైన విద్యే లక్ష్యం

- అంగన్‌వాడీల్లో ఉత్తమ బోధనకు ప్రభుత్వం చర్యలు
- ప్రీ స్కూల్ యాక్టివిటీపై ఐసీడీఎస్ పీవోలు, సూపర్‌వైజర్లకు శిక్షణ
- జిల్లాతో పాటు శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల వారికి కూడా..
- బ్యాచ్‌కు 250 మందికి చొప్పున శిక్షణ
- శిక్షణార్థులతో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ
- జిల్లాలో 2,499 అంగన్‌వాడీ కేంద్రాలు



తోటపాలేంలో చిన్నారులతో ప్రీస్కూల్ యాక్టివిటీ చేయిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కేంద్రాలకు వచ్చే పిల్లలంతా పేద, మధ్య తరగతి వర్గాల వారే కావడంతో వారిని ఎలాగైనా ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు జగనన్న సర్కారు మంచి ఆలోచనలతో ముందుకు సాగుతోంది. ఏ ఒక్కరూ తమ పిల్లలను కాన్వెంట్లకు పంపించలేకపోయామేననే భావనను తల్లిదండ్రుల్లో లేకుండా చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీనికోసం అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును పర్యవేక్షించే ఐసీడీఎస్ పీవోలు, సూపర్‌వైజర్లకు పిల్లలకు ఇచ్చే విద్యాబోధనలో నాణ్యత, మెలకువలపై శిక్షణ ఇస్తున్నారు. ప్రధానంగా ప్రీస్కూల్ యాక్టివిటీ(పూర్వ ప్రాథమిక విద్య)పై బోధనపై ఈ శిక్షణ ఉంటోంది. ఇప్పటికే కొంతమందికి శిక్షణ పూర్తికాగా, మరి కొంతమందికి శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు తమ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇవ్వనున్నారు.

#### శిక్షణతో ఉత్తమ ఫలితాలు..



అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఉత్తమ బోధన అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం ఐసీడీఎస్ పీవోలు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పొందిన వారు తమ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే కార్యకర్తలకు శిక్షణ ఇస్తారు. దీంతో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని ఆశిస్తున్నాం.

–బి.శాంతకుమారి, జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి.

#### 6 రోజుల పాటు శిక్షణ..

శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పనిచేస్తున్న ఐసీడీఎస్ పీవోలు, సూపర్‌వైజర్లకు విజయనగరం జిల్లాలోని మరుపల్లి వద్ద శిక్షణ ఇస్తున్నారు. బ్యాచ్‌కు 250 మంది చొప్పున ఒక్కో బ్యాచ్‌కు 6 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే రెండు బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి కాగా ప్రస్తుతం మూడో బ్యాచ్‌కు ఇచ్చే శిక్షణ కొనసాగుతోంది.

#### కాన్వెంట్‌ల కన్నా దీటుగా బోధన..

కాన్వెంట్‌లలో కన్నా దీటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధన ఉండేలా ప్రీస్కూల్ యాక్టివిటీ(పూర్వప్రాథమిక విద్య)పై శిక్షణ ఇస్తున్నారు. మరింత మంది పిల్లలు కేంద్రాలకు వచ్చేలా శిక్షణ విధానం ఉండగా, ప్రీస్కూల్ కిట్లను కూడా ప్రభుత్వం అందించనుంది. ఆటపాటలతో కూడిన విద్యనందించేందుకు అవసరమైన ఆట వస్తువులు, ఇతర సామగ్రి పంపిణీ చేయడం జరుగుతుంది. చెక్కలతో చేసిన ఏబీసీడీలు, కలర్స్ గుర్తించే బొమ్మలు, బిల్డింగ్‌ను కట్టే మెటీరియల్ తదితర వస్తువులు సామగ్రిలో ఉంటాయి. వీటితో పిల్లలకు సులువుగా బోధించవచ్చని ట్రైనీలు, ట్రైనర్లు చెబుతున్నారు.

#### జిల్లాలో 11 ఐసీడీఎస్ ప్రాజెక్టులు..

జిల్లాలో మొత్తం 11 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా, వీటిలో బొబ్బిలి, బాడంగి, చీపురుపల్లి, గజపతినగరం, గంట్యాడ, గరివిడి, ఎస్.కోట, వియ్యంపేట, విజయనగరం అర్బన్, రాజాం ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 2,499 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వీటి పర్యవేక్షణకు 11 మంది పీవోలు, 79 మంది సూపర్‌వైజర్లు ఉన్నాయి. వీరి పరిధిలో 8,558 మంది గర్భిణులు, 9,692 మంది బాలింతలు, 6 నెలల నుంచి సంవత్సరం లోపు పిల్లలు 10,351 మంది ఉన్నారు. వీరితో పాటు 7 నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలు 34,730 మంది, 3 నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలు 21,073 మంది ఉన్నారు.

## సాహితీ చైతన్యోత్సవం పోటీల విజేతలు వీరే..

విజయనగరం టౌన్: నగరంలో ఈ నెల 6వ తేదీన నిర్వహించిన గురజాడ సాహితీ చైతనోత్సవం సందర్భంగా చేపట్టిన పలు పోటీల్లో గెలుపొందిన వారి వివరాలను నిర్వాహకులు శనివారం వెల్లడించారు. విజేతలకు డిసెంబరు 3వ తేదీన సినీ గేయరచయిత చంద్రబోస్ చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేయనున్నట్లు గురజాడ సాంస్కృతిక సమైక్య ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్ తెలిపారు. వక్తృత్వ పోటీల్లో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కైవసం చేసుకున్న వారిలో ఎస్.వి.శేషాచార్యులు(పదో తరగతి, ఆదర్శ పాఠశాల, మదనాపురం), ఎస్.ఆశాభవాని(ఏడో తరగతి, గురజాడ స్కూల్, విజయనగరం), చరిత (పదో తరగతి, సన్ స్కూల్, విజయనగరం) ఉన్నారు. ఎం.ప్రణవ్(ఆరో తరగతి, సన్ స్కూల్, విజయనగరం), ఎం.సుచరిత (తొమ్మిదో తరగతి శ్రీచలపతి స్కూల్, విజయనగరం) కన్సొలేషన్ బహుమతులకు ఎంపికయ్యారు. జూనియర్స్ విభాగంలో జరిగిన పద్య పఠనం పోటీల్లో ప్రథమ బహుమతి కె.సాయి అక్షయశ్రీ(ఆరో తరగతి, సన్ స్కూల్, విజయనగరం), ద్వితీయ బహుమతి ఎం.గుణశేఖర్(ఏడో తరగతి, ఆదర్శ పాఠశాల, మదనాపురం), తృతీయ బహుమతి జి.వి.ఎల్.కామేశ్వరి( ఆరో తరగతి, గురజాడ స్కూల్, విజయనగరం) సాధించగా, కన్సొలేషన్ బహుమతులకు తనుశ్రీ(ఆరో తరగతి, విజ్ఞానభారతి, విజయనగరం), బి.భార్గవి(ఆరో తరగతి, జెడ్పీ ఉన్నత పాఠశాల, అలుగోలు), వి.నందగోపాల్(ఏడో తరగతి, సెయింట్ మారిస్ స్కూల్, విజయనగరం), ఎం.జశ్వంత్(ఆరో తరగతి, నారాయణ పబ్లిక్ స్కూల్, విజయనగరం), ధన వర్షిత(ఆరో తరగతి, నేషనల్ స్కూల్, విజయనగరం) ఎంపికయ్యారు. సీనియర్స్ విభాగంలో జరిగిన పద్యపఠనం పోటీల్లో టి.తేజస్వి(ఎనిమిదో తరగతి, సెయింట్ మారిస్ స్కూల్, విజయనగరం), ఎస్.ఎస్.వి.మౌక్తిక(తొమ్మిదో తరగతి, ఫోర్ట్ సిటీ స్కూల్, విజయనగరం), బి.దేదీప్య(తొమ్మిదో తరగతి, ఫోర్ట్ సిటీ స్కూల్, విజయనగరం) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి బహుమతులు కైవసం చేసుకోగా, పి.ఎస్.వి.శేషాచార్యులు(పదో తరగతి, ఆదర్శ పాఠశాల, మదనాపురం), ఎం.హర్షవర్ధన్, జెడ్పీ ఉన్నత పాఠశాల, అలుగోలు) వి.త్రినయని(బీసెంట్ స్కూల్, విజయనగరం) కన్సొలేషన్ బహుమతులకు అర్హత సాధించారు. సీనియర్స్ విభాగంలో జరిగిన వ్యాసరచన పోటీల్లో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఆర్.అంజలి(ఎనిమిదో తరగతి, విజయనగరం), కె.లక్ష్మీ శ్రీవాణి(తొమ్మిదో తరగతి, గురజాడ స్కూల్, విజయనగరం), ఎ.ఝాన్సీలక్ష్మి(పదో తరగతి, ఆదర్శ పాఠశాల, మదనాపురం) నిలిచి, బహుమతులు పొందగా, బి.ద్రాక్షాయణి(తొమ్మిదో తరగతి, బీసెంట్ స్కూల్, విజయనగరం) వి.కామేశ్వరి సుప్రజ( తొమ్మిదో తరగతి, మహారాజా హైస్కూల్, విజయనగరం)లు కన్సొలేషన్ బహుమతులు పొందారు. జూనియర్ విభాగంలో జరిగిన వ్యాసరచన పోటీల్లో వై.తేజస్విని(ఆరో తరగతి, గురజాడ స్కూల్, విజయనగరం), జి.అమృత వర్షిణి(ఏడో తరగతి, విజయనగరం), పి.దీపాశ్రీ( ఏడో తరగతి, సన్ స్కూల్, విజయనగరం)లు వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచి, బహుమతులకు ఎంపిక కాగా, కన్సొలేషన్ బహుమతికి సీహెచ్ శ్రావణి(ఏడో తరగతి, ఆదర్శ పాఠశాల, మదనాపురం) ఎంపికైనట్లు పేర్కొన్నారు.

## ఉపాధ్యాయుడి తీరుపై విచారణ



చోడమ్మఅగ్రహారం పాఠశాలలో విచారణ చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు శంకరరావు

పూసపాటిరేగ: మండలంలోని చోడమ్మఅగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వై.శంకరగిరినాయుడు తీరుపై శనివారం విచారణ చేపట్టారు. విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారన్న ఎంఈవోకు అందిన మౌఖిక ఫిర్యాదుతో డీఈవో లింగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. పూసపాటిరేగ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడుబి.శంకరరావు పాఠశాలలో విచారణ చేశారు. తొలుత పాఠశాల హెచ్‌ఎం వై.జయంతిమాలతో పాటు ఉపాధ్యాయులు, సర్పంచ్ కొత్తకోట శ్రీరాములు, పీఎంసీ చైర్మన్ పిసిని పైడిరాజు, ఫిర్యాదుదారు బాకూరి బాలకృష్ణలను విచారించారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ ఏదో తెలియని చిన్నారుల పట్ల సదరు ఉపాధ్యాయుడు దారుణంగా వ్యవహరిస్తున్నారని, పాఠశాలకు చెడ్డ పేరు రాకూడదనే సదుద్దేశ్యంతోనే మౌఖికంగా ఎంఈవోకు ఫిర్యాదు చేశామని బాలకృష్ణ తెలిపారు. బాధిత విద్యార్థినులను తమ ముందుకు తీసుకురాలేమని, మరోసారి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. పాఠశాల పేరు నిలబెట్టాలని, గ్రామానికి మంచి పేరు వచ్చేలా ఉపాధ్యాయులు ప్రవర్తించాలని పీఎంసీ చైర్మన్ పైడిరాజు, సర్పంచ్ శ్రీరాములు విచారణ అధికారి శంకరరావుకు తెలిపారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువులే ఇలా చేస్తే సభ్యసమాజానికి ఏం సందేశం ఇచ్చినట్లు అని ప్రశ్నించారు. మంచిగా నడుచుకోవాలని సూచించారు. విచారణలో సిబ్బంది, గ్రామస్తులు, ఫిర్యాదుదారు తెలియజేసిన విషయాలతో డీఈవోకు నివేదిక అందజేస్తామని తెలిపారు.

## చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



చోరీ వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ తిరుపతిరావు(వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: చోరీ కేసులో నిందితుడిని రూరల్ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకుని, అరెస్ట్ చేశారు. రూరల్ సీఐ టి.వి.తిరుపతిరావు వివరాలిలా ఉన్నాయి.. ద్వారపూడి వినాయకనగర్‌లో నివాసముంటున్న హిమమణి, ఆమె భర్త సూర్యప్రకాష్ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఈ నెల 6వ తేదీన ఎప్పటిలాగే విధుల నిమిత్తం పాఠశాలకు వారు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో హిమమణి ఇంటికి వచ్చి, చూడగా ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. 8 తులాల బంగారు ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, ఎస్ఐ గణేష్ బృందం దర్యాప్తు చేపట్టారు. గతంలో వారింటి పనులు చేసిన కాళీఘాట్ కాలనీకి చెందిన బొందిలి దిలీప్‌కుమార్ అనే వ్యక్తే ఇంటికి వచ్చి, చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ఈ మేరకు అతడిని విచారణ చేయగా, ఇంటి తాళాలు తీసి, బీరువాలోని ఆభరణాలు దొంగిలించినట్లు అంగీకరించాడని సీఐ తెలిపారు. నిందితుడి వద్ద నుంచి ఆభరణాలు రికవరీ చేశామన్నారు. ఈ కేసు ఛేదనలో క్రియాశీలక పాత్ర పోషించిన ఎస్ఐ గణేష్, కానిస్టేబుళ్లు కె.రామమోహనగౌరి, రామకృష్ణ తదితరులను అభినందించారు.

## పంచారామాల దర్శనానికి ప్రత్యేక బస్సులు

- జిల్లా ప్రజారవాణా అధికారి టీవీఎస్ సుధాకర్

పార్వతీపురంటౌన్: కార్తీకమాసం సందర్భంగా, పంచారామాల దర్శనానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజారవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఈ నెల 19, 26వ తేదీల్లో అలాగే డిసెంబరు 3, 10వ తేదీల్లో పంచారామ క్షేత్రాలను దర్శించుకునేలా పార్వతీపురం డిపో నుంచి బస్సులు ఏర్పాటు చేశామన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు పార్వతీపురం బస్టాండ్ నుంచి బస్సులు బయలుదేరి, మరుసటిరోజు ఉదయం అమరావతి(అమరేశ్వరుడు)చేరుకుంటుందని, అక్కడ నుంచి భీమవరం (భీమేశ్వరుడు), పాలకొల్లు(క్షీర రామలింగేశ్వరుడు), ద్రాక్షారామం(భీమలింగేశ్వరుడు), సామర్లకోట(కుమార లింగేశ్వరుడు) ఆలయాలు దర్శించుకుని, తిరిగి రావడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**శబరిమలకూ..**

శబరిమల అయ్యప్ప భక్తుల కోసం పార్వతీపురం డిపో నుంచి సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్ ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. శబరిమల ఆరురోజుల యాత్రలో కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, పళని, ఎరుమేలి, శబరిమల, మదురై, కంచి, తిరుపతి, విజయవాడకు బస్సులు వేస్తున్నామన్నారు. ఒక్కో ప్రయాణికునికి సూపర్ లగ్జరీకి రూ.7,300, అల్ట్రా డీలక్స్‌కు రూ.7,200 చార్జీ నిర్ణయించామన్నారు. టూర్ ప్యాకేజీ వారు కోరిన రోజుల్లోనే బస్సు మొత్తం బుక్‌చేసుకుని వెళ్లే సౌకర్యం కూడా కల్పించామన్నారు. అడ్వాన్స్ రిజర్వేషన్‌కు ఫోన్ నంబర్ 7382834909ను సంప్రదించి, టికెట్ రిజర్వేషన్ చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలనుకునే వారు ఏపీఎస్ఆర్టీసీ వెబ్‌సైట్ నందు రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు.

## మాజీ సైనికులకు ఇళ్లస్థలాలు ఇవ్వండి

- మాజీ సైనికుల సంక్షేమ బోర్డు అధికార సభ్యులు



మాట్లాడుతున్న జిల్లా సైనిక సంక్షేమ అధికారి కృష్ణారావు

విజయనగరం అర్బన్: జిల్లాలో మాజీ సైనికులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని మాజీ సైనికుల సంక్షేమ బోర్డు అధికార సభ్యులు, మాజీ సైనికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.డి.అనిత అధ్యక్షతన ఆమె చాంబరులో శనివారం జరిగిన సైనిక సంక్షేమ సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో 2 వేల మంది మాజీ సైనికులు దరఖాస్తు చేసుకున్నారని, వారందరికీ ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని కోరారు. ఈసీహెచ్ఎస్ హాస్పిటల్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, క్యాంటీన్ సదుపాయాలు ఏర్పాటు చేసుకోవడానికి గాజులరేగలో స్థలం కేటాయించాలన్నారు. అలాగే జిల్లాలో ప్రభుత్వ రంగ ఉద్యోగాల నియామకాల్లో మాజీ సైనికులకు కేటాయించిన 2 శాతం రోస్టర్ రిజర్వేషన్ అమలు చేయడానికి సూచనలు ఇవ్వాలని జిల్లా యంత్రాంగాన్ని కోరారు. అనంతరం రక్తదాత బొడ్డేపల్లి రామకృష్ణారావుకు ప్రోత్సాహకంగా రూ.10 వేల నగదును డీఆర్‌వో అనిత చేతులమీదుగా జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు అందజేశారు.

## సైన్స్ కాంగ్రెస్ పోటీలకు పార్వతీపురం విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులను మెమెంటోలతో అభినందిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

పార్వతీపురంటౌన్: రాష్ట్ర స్థాయి సైన్స్ కాంగ్రెస్ పోటీలకు పార్వతీపురం విద్యార్థులు ఎంపికయ్యారని డీఈవో ఎస్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన ఎంపికైన విద్యార్థులను అభినందించి, కాసేపు మాట్లాడారు. అక్టోబరులో జరిగిన 31వ జిల్లా బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో పార్వతీపురం పట్టణంలోని జిల్లా పరిషత్ సంస్కృత పాఠశాల విద్యార్థులు అంకం ఝాన్సీ, కుండలీశ్వరి కీర్తిప్రియ, అనుపోజు తన్మయి సేవ్ ఎలిఫెంట్ అండ్ ఎకోసిస్టం విత్ ప్లాన్ బివేర్ ఈస్ మై ఎలిఫెంట్ ప్రాజెక్టులు రూపొందించి, ప్రదర్శించడంలో విశేష ప్రతిభ కనబరచడంతో ప్రథమ స్థానం దక్కించుకున్నారన్నారు. ఆండ్రాయిడ్ యాప్‌ను క్రియేట్ చేసి, జీపీఎస్ టెక్నాలజీ, సెన్సార్స్, ఆటోమేటిక్ ఎస్ఎంఎస్ సర్వీస్ సిస్టమ్స్ ద్వారా పార్వతీపురం మన్యం జిల్లాలో తరచుగా సంభవిస్తున్న ఏనుగుల మరణాలను నిరోధించవచ్చని, ఏనుగులను సంరక్షించుకోవచ్చని, భవిష్యత్తులో ఏనుగులు అంతరించిపోకుండా ఉంచవచ్చని, ప్రమాదాల నుంచి ఏనుగులను రక్షించవచ్చని, గజరాజుల దాడిలో ప్రజలెవరూ మరణించకుండా ఉండొచ్చని, పంట పొలాలను కాపాడవచ్చని నిరూపించే ఓ వినూత్న ప్రాజెక్టును వీరు తయారు చేయడం అభినందనీయమన్నారు. ఈ నెలాఖరులో గుంటూరు కేఎల్ వర్సిటీలో జరిగే రాష్ట్ర స్థాయి సైన్స్ కాంగ్రెస్ పోటీలకు హాజరవుతారన్నారు. అక్కడ కూడా ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి సైన్స్ కాంగ్రెస్ పోటీలకు వెళ్లాలని, డీఈవో, ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

### చికెన్

| బ్రాయిలర్ | | |
|---|---|---|
| లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
| ₹102 | ₹174 | ₹184 |